
రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రమణీయం.. శ్రీశైలేశుడి రథోత్సవం


రమావాణీసేవిత రాజేశ్వరి అలంకారంలో అమ్మవారు


రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు


పంచాంగం వినిపిస్తున్న శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ


గుమ్మడి, కొబ్బరి కాయలను సమర్పిస్తున్న ఈవో తదితరులు

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని దేవ దేవుడికి వైభవంగా రథోత్సవం జరిగింది. సాయంత్రం రథశాల వద్ద ఆలయ అర్చకులు రథానికి రథాంగపూజ, రథాంగ హోమం, రథాంగబలి కార్యక్రమాలు నిర్వహించారు.

తదుపరి ఉభయ దేవాలయ ప్రాంగణంలో విశేష అర్చనలు, హారతులందుకున్న స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో రాజగోపురంమీదుగా రథశాల వద్దకు మేళతాళాలు, భజంత్రీల మధ్య తీసుకొచ్చారు. గంగాధర మండపం నుంచి నంది మండపం దాకా, అక్కడి నుంచి తిరిగి గంగాధర మండపం వరకు రథోత్సవం సాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు రథోత్సవంలో దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు అశ్వవాహన సేవ

ఉగాది ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం భ్ర మరాంబదేవి నిజాలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. రాత్రి స్వామిఅమ్మవార్లకు అశ్వావాహన సేవ ఆలయ ఉత్సవం నిర్వహించనున్నారు.

రమా వాణీ సేవిత రాజరాజేశ్వరి అలంకారంలో అమ్మవారు

ఉగాది ఉత్సవాల్లో అమ్మవారి అలంకారాలలో భాగంగా ఆదివారం రమావాణీసేవిత రాజరాజేశ్వరీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు అమ్మవారి ఉత్సమూర్తికి ర మావాణీ సేవిత రాజరాజేశ్వరీ అలంకారం చేసి విశేష పూజలు, మంగళహారతులు నిర్వహించారు.

● తరలివచ్చిన అశేష భక్తజనం ● శివనామ స్మరణతో మార్మోగిన శ్రీగిరి

సమృద్ధిగా ఆహార ధాన్యాలు

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): దేశంలో ఈ ఏడాది ఆహార ధాన్యాలు సమృద్ధిగా ఉంటాయని రాజమండ్రికి చెందిన శ్రీశైల దేవస్థాన ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ పంచాగం పఠనం చేశారు. శ్రీశైల మహాక్షేత్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ఉదయం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో పంచాంగ పఠన కార్యక్రమం నిర్వహించారు. ఈవో శ్రీనివాసరావు దేవస్థానం తరపున ఆస్థాన సిద్ధాంతి పండిత బుట్టే వీరభద్ర దైవజ్ఞ వారికి నూతన వస్త్రాలు అందజేసి పంచాంగ పఠనానికి ఆహ్వానించారు. ఆస్థాన సిద్ధాంతి విశ్వావసునామ సంవత్సర విశేషాలను వివరించారు. మంచి వర్షపాతం నమోదవుతుందన్నారు. ఎర్ర నేలలో పంటలు బాగా పండుతాయన్నారు. ఆహారధాన్యాలు సమృద్ధిగా పండుతాయని, గోధుమ, శనగ, పెసలు, ఉలువలు మంచి దిగుబడి ఉందని చెప్పారు. వరి, వేరుశనగ, చెరకు, బెల్లం, పంచదార, నెయ్యి, నూనెగింజల ధరలు పెరగవచ్చని చెప్పారు. రక్షణ రంగానికి నిధులు కేటాయిస్తారని, అంతరిక్ష పరిశోధనలు విజయవంతమవుతాయని, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ఖ్యాతి పెరుగుతుందని చెప్పారు. అలాగే బంగారం, వెండి రేట్లు పెరిగే అవకాశం ఉందన్నారు. క్రీడా రంగాలలో మంచి విజయాలు ఉంటాయన్నారు. ఈ ఏడాది మన దేశంలో భాద్రపద పౌర్ణిమ రోజు 2025 సెప్టెంబరు 7న సంపూర్ణ చంద్రగ్రహణం, ఫాల్గుణ పౌర్ణమి రోజు 2026 మార్చి 3న గ్రస్తోదయ సంపూర్ణ చంద్ర గ్రహణం కనిపిస్తాయని తెలిపారు.

ధార్మిక మార్గం

● ముగిసిన 30 రోజుల ఉపవాస దీక్షలు ● నేడు ఈద్-ఉల్-ఫితర్



నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్‌కు సంకేతంగా ఆదివారం ఆకాశంలో నెలవంక కనిపించింది. మానవాళి ధార్మిక జీవితానికి దిశా నిర్దేశం చేసే రంజాన్ వేడుకలను సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. 30 రోజుల ఉపవాసం దీక్షలు ఆదివారం నెలవంక దర్శనంతో ముగిశాయి. ఈద్గాల వద్ద సోమవారం ఉదయం 9.30గంటలకు ప్రత్యేక నమాజ్ చేయడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు..

ఆధ్యాత్మిక చింతనే రంజాన్ సారం

మానవాళిలో అధ్యాత్మిక చింతన పెంచడమే రంజాన్ లక్ష్యం. ఈ నెలలో రోజంతా ఉపవాసం ఉండి, ఐదు పూటల నమాజ్ చేశారు. పవిత్ర ఖురాన్ గ్రంథాన్ని పఠించారు. పేదలకు దానం చేయమని రంజాన్ ఉద్బోధిస్తుంది. ఇస్లాం ధార్మిక ప్రపంచానికి ఉపవాసం, ప్రార్థన, దానం మూల స్తంభాలు.

నమాజులకు ఈద్గాలు సిద్ధం



ఎస్ఆర్‌బీసీ కాలనీ ఈద్గా (తయ్యబా ఈద్గా), భీమవరం రోడ్డులోని ఈద్గా(అల్ ఫుర్ఖాన్‌ఈద్గా), బొమ్మలసత్రం మసీదు ఈద్గా, తిక్కస్వామి దర్గా వద్ద గల ఈద్గా (కుబ్రా ఈద్గా)ల వద్ద, మెదలయిన ప్రాంతాలలో ఈద్ నమాజ్ నిర్వహిస్తున్నాం. ఈ ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశాం.
-అంజద్‌బాషా సిద్ధిఖీ, నంద్యాల జిల్లా ఇమాముల సంఘం అధ్యక్షుడు

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

నంద్యాల నూనెపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఈ నెల 31న రంజాన్ పండుగ సందర్భంగా రద్దుచేసినట్లు కలెక్టర్ రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి వ్యయప్రయాసలతో జిల్లా కేంద్రానికి రావద్దని ఆమె సూచించారు.

నంద్యాల క్రైం: నంద్యాల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం రంజాన్ పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సుదూర ప్రాంతాల నుంచి వ్యయప్రయాసలకోర్చి రావొద్దని సూచించారు. జిల్లా ప్రజలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

ఉమ్మడి జిల్లాకు ఉగాది పురస్కారాలు 7
నేడు పిడకల సమరం
16 మంది సీఐల బదిలీ 7
ఉగాది ప్రత్యేకం ... ఎడ్ల బండ్ల ప్రదర్శన

వైభవంగా ఉగాది

విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకల ను ఆదివారం జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అర్చకులు దేవాలయాల్లో స్వామివార్లకు నూతన వస్త్రాలంకరణ చేసి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రజలు తమ ఇళ్లను మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. పలు కూడళ్లు, ఇళ్ల వద్ద చిన్నారులు, పెద్దలు రంగులు చల్లుకొని ఉత్సాహంగా వేడుకలను నిర్వహించుకున్నారు. ప్రజలు షడ్రుచుల పచ్చడి, తీపి చేసుకుని ఉగాది వేడుకలు నిర్వహించుకున్నారు. గ్రామోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. -నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి)


అహోబిలంలో పల్లకిపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు


సంజీవనగర్ రామాలయంలో పంచాంగ పఠనం


మహానందిలో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

అభివృద్ధి పథంలో ముందుండాలి

● మంత్రులు ఫరూక్, బీసీ
● కలెక్టరేట్‌లో ఘనంగా విశ్వావసు నామ ఉగాది వేడుకలు

నంద్యాల నూనెపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్ఫూర్తితో జిల్లా అధికార యంత్రాంగం కష్టపడి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో విశ్వావసు నామ ఉగాది ఉత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డిలతోపాటు కలెక్టర్ రాజకుమారి, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు. వేదపండితులు మంత్రోచ్చరణల మధ్య కార్యక్రమాన్ని ప్రారంభించగా ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలనం చేశారు. ప్రవీణ్‌కుమార్ శర్మ, శివకుమార్ శర్మ ఉగాది పంచాంగాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంత్రులు ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన తొలి ఉగాది పండుగ కావడంతో తెలుగువారి సంప్రదాయం ప్రకారం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, ఆర్డీవో విశ్వనాథ్, ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం: ఉగాది ఉత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. గెలివి సహదేవుడు, గ్రంథే నరేంద్ర, గంగుల నాగరాజు, దోనిపూడి నరేష్, నీలం వెంకటేశ్వర్లు, కొప్పుల ప్రసాద్, నీలకంఠమాచారి, మహబూబ్‌బాషా, అన్నెం శ్రీనివాసరెడ్డి, శేష ఫణి తదితరులు పాల్గొన్నారు. వీరందరినీ మంత్రులు, కలెక్టర్, జేసీ అభినందించి సన్మానించారు.

విశిష్ట సేవలకు పురస్కారాలు: జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వ్యక్తులకు ఉగాది ఉత్సవాల కార్యక్రమంలో పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. వ్యవసాయ రంగంలో పగిడాల వెంకటేశ్వర్లు, విద్యారంగంలో వైష్ణవ వెంకటరమణ, పరిశ్రమల రంగంలో గెలివి రామకృష్ణ, క్రీడారంగంలో మల్లికార్జున, సామాజిక సేవారంగంలో నాగశేషులను సన్మానించారు.


ఉగాది ఉత్సవాలకు హాజరైన మంత్రులు ఫరూక్, బీసీ, కలెక్టర్, జేసీ

సెరికల్చర్ అసిస్టెంట్లకు పదోన్నతి

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో సెరికల్చర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న 11 మందికి పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి దాకా వీరు పంచాయతీరాజ్ అజమాయిషీలో పని చేస్తున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించడంతో వీరంతా పట్టుపరిశ్రమశాఖ పరిధిలోకి రానున్నారు. టెక్నికల్ అసిస్టెంట్లను నాగలింగం, శ్వేతను నంద్యాల సెరికల్చర్ విభాగానికి బదిలీ చేయగా.. అరవింద్, కలాం, రాజేశ్వరి, పుల్లయ్యను ఆత్మకూరు ఏడీకి అటాచ్ చేశారు. మాధవీలత, శివతేజ, సావిత్రి, మోహన్ ప్రసాద్, శివతేజ, పుల్లయ్యలను కర్నూలు సెరికల్చర్ విభాగానికి బదిలీ చేశారు.

బియ్యం గింజపై రంజాన్ చిత్రాలు

నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): నంద్యాలకు చెందిన ప్రముఖ చిత్ర కారుడు చింతలపల్లె కోటేష్ రంజాన్ పర్వ దినం సందర్భంగా బియ్యపు గింజపై అతి సూక్ష్మ చిత్రాలు వేశారు. భక్తుడు అల్లా కు ప్రార్థన చేస్తున్నట్లు, నెల వంక, నక్షత్రం వున్నట్లు చిత్రీకరించా రు. మైక్రో బ్రష్ ద్వారా ఈ చిత్రం వేసినట్లు చిత్రకారుడు కోటేష్ తెలిపారు.





బియ్యం గింజపై రంజాన్ చిత్రాలు

డిగ్రీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూని వర్సిటీ పరిధిలో డిగ్రీ 1,3,5 సెమిస్టర్ రెగ్యులర్, సప్లమెంటరీ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. మరిన్ని వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

ఉమ్మడి జిల్లాకు ఉగాది పురస్కారాలు

- కళారత్న (హంస) పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్య
- ఉగాది విశిష్ట పురస్కారం పొందిన డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్



సీఎం చంద్రబాబు నుంచి అవార్డులు అందుకుంటున్న పత్తి ఓబులయ్య, ఎస్‌డీవీ అజీజ్, హరికిషన్

కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏటా ఉగాది పర్వదిన సందర్భంగా కవులు, కళాకారులకు అందిం చే ఉగాది కళారత్న (హంస), ఉగాది విశిష్ట పురస్కారాలను ఈసా రి జిల్లాకు చెందిన పత్తి ఓబులయ్య, సాహితీవేత్తలు డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్ అందుకున్నారు. ఆదివారం ఉదయం విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, రాష్ట్ర దేవదాయ శాఖ, పర్యాటక శాఖ, భాషా సాంస్కృతిక వ్యవహారాల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరై ఈ పురస్కారాలు అందజేశారు. నాటక రంగంలో కర్నూలు కు చెందిన టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్యకు ప్రతిష్టాత్మక కళారత్న (హంస) పురస్కారం ముఖ్యమంత్రి అందజేశారు. ఆయనకు హంస ప్రతిమతోపాటు, రూ.50 పారితోషికాన్ని అందజేసి, శాలువతో సత్కరించారు. అలాగే సాహితీ రంగంలో విశేషంగా సేవలు అందిస్తున్న డాక్టర్ ఎం. హరికిషన్, ఎస్‌డీవీ అజీజ్‌లకు ఉగాది విశిష్ట పురస్కారాలు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రదానం చేశారు. వారికి తెలుగు తల్లి ప్రతిమతోపాటు రూ.10 వేలు నగదు అందజేశారు.

ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌కు హంస పురస్కారం



ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఆర్ఎస్ ప్రసాద్

నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాలకు చెందిన కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్‌కు విజయవాడులో ఆదివారం ఉగాది ఉత్సవాలలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కళారత్న హంస పురస్కారం అందించారు. గోల్డ్‌కలర్ హంస, 50వేల రూపాయలు చెక్కు, సర్టిఫికెట్‌ను ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాకారుడు ఎస్ఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ కళాకారులకు పూర్వవైభవం వచ్చిందన్నారు. ఈ సందర్భంగా నంద్యాలలోని ప్రముఖులు, కళారాధన నిర్వాహకులు డాక్టర్ రవిక్రిష్ణ, డాక్టర్ మధుసూదనరావు, కళాకారులు, తోటి మిత్రులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

రిజిస్ట్రేషన్‌కు స్లాట్ బుకింగ్ సౌకర్యం

- కర్నూలు జిల్లా కేంద్రంలో ఏప్రిల్ 2 నుంచి అమలు
- స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ ఉత్తర్వులు జారీ

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కర్నూలు సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లను సరళతరం చేసేందుకు స్లాట్ బుకింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈమేరకు స్టాం పులు రిజిస్ట్రేషన్ శాఖ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారని కర్నూలు సబ్ రిజిస్ట్రార్ వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా కోరుకున్న సమయానికి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించుకునేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారని తెలిపారు. స్లాట్ బుకింగ్ వినియోగదారులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వారు కోరుకున్న రోజున నిర్దిష్ట సమయానికి ఆన్లైన్ ద్వారా ఈ-స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. ప్రతి రోజూ రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయం ఉదయం 10.30 నుండి సాయంత్రం 5.30 గంటల వరకు ఉంటుందన్నారు.

సచివాలయ ఉద్యోగి ఆత్మహత్య

ఆదోని, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపటి గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ మధు (26) ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు.. పట్టణంలోని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన నారాయణరావు, సరోజబాయి దంపతుల చిన్న కుమారుడు మధు కపటిలో విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం విధులు ముగించుకొని ఇంటికి వచ్చి రాత్రి భోజనం అనంతరం ఇంటి పైన ఉన్న గదిలో నిద్రించాడు. రోజూ తెల్లవారుజామున లేచే తమ కుమారుడు ఆదివారం ఉదయం 9.30లకు కూడా కిందకు రాకపోవడంతో తల్లిదండ్రులు వెళ్లి కిటికీలో నుంచి చూడగా, ఫ్యానుకు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే త్రీ టౌన్ సీఐ రామలింగయ్యకి సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. తండ్రి నారాయణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోలీసుల కృషి అభినందనీయం

ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా



పరిశీలిస్తున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా

శ్రీశైలం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైలం ఉగాది మహోత్సవాల బందోబస్తులో పోలీసు అధికారులు, సిబ్బంది కృషి అభినందనీయమని ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉగాది ఉత్సవాలకు బందోబస్తుకు వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు జరుగకుండా నిర్విరామంగా కృషి చేశారని అన్నారు.

ఆలయం క్యూలైన్లు కంపార్ట్మెంట్లు పరిశీలించిన ఎస్పీ

శ్రీశైలంలో ఉగాది మహోత్సవాల సందర్భంగా ఆదివారం నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయం పరిసరాలు, భక్తులు వేచివుండు కంపార్ట్మెంట్లు, క్యూలైన్లను పరిశీ లించి అక్కడ ఉన్న సిబ్బందికి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదే శించారు.

నేడు పిడకల సమరం

- ఆస్పరి మండలం కైరుప్పలలో ఉగాది ప్రత్యేకత
- ఆలయ ప్రాంగణంలో సమరానికి సిద్ధంగా ఉంచిన పిడకలు
- సమరం.. గ్రామస్థులకు సంబరం



సమరానికి సిద్ధం చేసిన పిడకలు

ఆదోని/ఆస్పరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పండుగకు ఆస్పరి మండలంలో ఓ ప్రత్యేకత ఉంది. పండుగ మరుసటి రోజైన సోమవారం కైరుప్పల గ్రామంలో పిడకల సమరం నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. కైరుప్పల గ్రామంతో పాటు సమీప గ్రామాలైన పుష్పాలదొడ్డి, చెన్నంపల్లి, వెంగళాయదొడ్డి, కారుమంచి, కలపరి, యాటకల్లు గ్రామాల ప్రజలు రెండు వర్గాలుగా ఏర్పడి పిడకలతో కొట్టుకోవడం, అనంతరం కలిసిపోవడం అనవాయితీగా వస్తున్న వేడుక. చాలా ఏళ్లుగా కొనసాగిస్తున్న ఈ పిడల సమరాన్ని తిలకించేందుకు మండలంలోని గ్రామాల ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వస్తారు. శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి ప్రేమాయణంలో తలెత్తిన ఓ చిన్న వివాదానికి గుర్తుగా దీన్ని జరుపుకుం టారు. ఉదయం ప్రత్యేక పూజలు అనంతరం ఆలయ ప్రాంగణంలో గ్రామస్తులు పిడకలను సిద్ధం చేసుకుంటారు. సాయంత్రం పుష్పాలదొడ్డి, చెన్నపంల్లి గ్రామస్తులు తమ గ్రామ దేవుళ్లను పల్లకిలో కైరుప్పలకు తీసుకొస్తారు. కొద్దిసేపటికే కారుమంచి రెడ్డి తన మంది మార్బలంతో ఆలయ ప్రాంగణంలోనికి ప్రవేశించగానే రెండు వర్గాల వారు పిడకలను ఒకరిపై ఒకరు విసురుకుంటారు. ఈ పిడకల సమరం దాదాపు గంటపాటు సాగుతుంది. చివరకు విజయ దరహాసంతో వీరభద్రస్వామి ఆలయం చేరుకోవడంతో ఈ సంబరం ముగుస్తుంది.



వీరభద్ర స్వామి



కాళికాదేవి

ఉగాది ప్రత్యేకం ... ఎడ్ల బండ్ల ప్రదర్శన

- నేడు రజకుల గాడిదల ప్రదర్శన



ఆలయం చుట్టూ ఎడ్ల బండిని తిప్పుతున్న రైతులు

కల్లూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో ఉగాది సంబరాలు అత్యంత ప్రత్యేకతను సంతరించు కున్నాయి. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కార్య నిర్వహణ అధికారి గురెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు ఆలయంలో పంచాంగ శ్రవణం, దేవిఖడ్గమాలా స్తోత్రపూజ జరిపారు.

ఉత్సాహభరితంగా రైతుల ఎడ్లబండ్ల ప్రదర్శన

ఉగాది వేడుకల్లో భాగంగా ఎడ్లబండ్ల ప్రదర్శన ఉత్సాహభరితంగా అందరినీ అలరించింది. ముందుగా కల్లూరు ఊరివాకిలి రైతులు మొక్కులు తీర్చుకునేందుకు ఎద్దులను అలంకరించి ఊరేగించారు. ఊరువాకిలి నుండి మేళతాలతో ఊరేగిస్తూ అమ్మవారి ఆలయం చుట్టూ రైతులు ఎద్దులబండ్ల ప్రదక్షిణ చేశారు. ఆలయంలో నారుమడి పద్ధతిలో రైతుసంఘం, ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన బురదనీటిలో రైతులు, యువత కేరింతల నడుమ ఎడ్లబండ్ల ప్రదర్శన కన్నులపండువగా నిర్వహించారు. తమ మొక్కులను తీర్చుకునేందుకు తరలి వచ్చిన ఎండ్లబండ్ల ఊరేగింపు తిలకించేందుకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు, భక్తులు ఆశేషంగా తరలివచ్చారు. ఇదే తరహాలో నేడు రజకులు పుష్కలంగా వర్షాలు కురవాలని భక్తిశ్రద్దలతో గాడిదలను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న గౌరు దంపతులు

గౌరు దంపతుల పూజలు: కల్లూరులోని చౌడేశ్వరీదేవి ఆలయాన్ని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డి ఆదివారం సందర్శించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గౌరు దంపతులకు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. చౌడేశ్వరీదేవి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అట్లాగే మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని ఉమామహేశ్వరమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు

ఆత్మకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసిన కేసులో భర్తను అరెస్టు చేసినట్లు ఆత్మకూరు రూరల్ సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి ఆది వారం తెలిపారు. వెలుగోడు పోలీసు స్టేషన్ పరిధిలోని తిమ్మనపల్లి గ్రామా నికి చెందిన ఇస్కాల మధుకృష్ణ తన భార్య ఇస్కాల లక్ష్మీదేవి అలియాస్ పుల్లమ్మకు వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో ఈ నెల 28వ తేదిన గొడ్డలితో దాడి చేసి హత్య చేశాడు. మృతురాలి తల్లి వెంకటసు బ్బమ్మ ఫిర్యాదు మేరకు నిందితున్ని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నంద్యాల క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ఉప్పరిపేటలో రూ.10వడ్డీకి అప్పు తీసుకొని అప్పుదారుల వత్తిడి తట్టుకోలేక మహేష్ అనే వ్యక్తి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రైవేట్ అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న మహేష్ వడ్డీ వ్యాపారుల వత్తిడి తట్టు కోలేక ఆదివారం ఇంట్లో నిద్రమాత్రలు మింగి అపస్మారకస్థితికి చేరు కున్నాడు. కుటుంబసభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

తెలుగు సంస్కృతికి ప్రతీక ఎద్దుల పోటీలు: మంత్రి



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి ఫరూక్

గోస్పాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంస్కృతికి ఎద్దుల పోటీలు ప్రతీక అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఉగాది పర్వదినం, అంకాళమ్మ తిరుణాళ్ల సందర్భంగా సాంబవరం గ్రామంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎద్దుల పోటీలను మంత్రి ఫరూక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు వారి మొదటి పండుగ ఉగాది సందర్భంగా ఎద్దుల పోటీలు జరడం ఆనవాయితీ అన్నారు. ఈ పోటీల్లో నందికొట్కూర్ మండలం కొణిదేల గ్రామానికి చెందిన దండు శేఖర్ ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ 50 వేలు దక్కించుకున్నాయి. వరుసగా నాలుగు స్థానాల్లో నిలిచిన ఎద్దుల యజమానులకు నగదు బహుమతులు ఇచ్చారు.

16 మంది సీఐల బదిలీ

కర్నూలు క్రైం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు అనంతపురం రేంజ్ పరిధిలో 16 మంది సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు.

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
యు. సదాశివయ్య	పిటీసీ, తిరుపతి	ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్, వైఎస్సార్ కడప
ఎం.యుగంధర్	ప్రొద్దుటూరు టూటౌన్ పీఎస్, వైఎస్సార్ కడప	ఆళ్లగడ్డ యుపీఎస్, నంద్యాల
ఎస్.చిరంజీవి	ఆళ్లగడ్డ యూపీఎస్, నంద్యాల	ఫ్యాక్షన్ జోన్, కర్నూలు
వై.ఎల్లమరాజు	వీఆర్, అన్నమయ్య	మహిళా పోలీస్ స్టేషన్, వైఎస్సార్ కడప
ఎం.కృష్ణారెడ్డి	మహిళా పోలీస్ స్టేషన్, వైఎస్సార్ కడప	చెన్నూరు యూపీఎస్, వైఎస్సార్ కడప
ఆర్.పురుషోత్తం రాజు	చెన్నూరు యుపీఎస్, వైఎస్సార్ కడప	ఎస్‌బీ-1, వైఎస్సార్ కడప
టి.రెడ్డప్ప	ఎస్‌బీ-1, వైఎస్సార్ కడప	సీసీఎస్-2, వైఎస్సార్ కడప
ఎస్.చాంద్‌బాషా	సీసీఎస్-2 వైఎస్సార్ కడప	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప
టి.నరసింహులు	పులివెందుల యూపీఎస్, వైఎస్సార్ కడప	వేంపల్లి యూపీఎస్, వైఎస్సార్ కడప
ఏ.సురేష్ రెడ్డి	వేంపల్లి యూపీఎస్, వైఎస్సార్ కడప	వీఆర్, వైఎస్సార్ కడప
పి.ఈశ్వర్ రెడ్డి	వీఆర్, వైఎస్సార్ కడప	డీసీఆర్‌బీ, వైఎస్సార్ కడప
యు.వెంకట కుమార్	డీసీఆర్‌బీ, వైఎస్సార్ కడప	వీఆర్, వైఎస్సార్ కడప
హెచ్. కృష్ణమరాజు నాయక్	వీఆర్, వైఎస్సార్ కడప	సీసీఎస్-1 వైఎస్సార్ కడప
సి.భాస్కర్ రెడ్డి	సీసీఎస్-1 వైఎస్సార్ కడప	వీఆర్, వైఎస్సార్ కడప
వి.శ్రీహరి	వీఆర్, కర్నూలు	మైదుకూరు యూపీఎస్, వైఎస్సార్ కడప
ఎం. గంగిరెడ్డి	వీఆర్, నంద్యాల	సీసీఎస్-2 నంద్యాల

సంస్కృతిని భావి తరాలకు అందించాలి

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- టీజీవీ కళాక్షేత్రంలో వైభవంగా ఉగాది సంబరాలు

కర్నూలు కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందజేయాలని, కులమతాలకు అతీతంగా పండు గలను అందరూ కలిసిమెలసి జరుపుకోవాలని రాజ్య సభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి శ్రీ విశ్వావసు నామ ఉగాది సంబరాలు కన్నుల పండువ గా సాగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన టీజీ వెంకటేశ్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ పండుగల్లో ఉగాదికి ప్రత్యేక స్థానమని చెప్పారు. ఉగాది వేడుకలో స్వీకరించే షడ్రుచుల ఉగాది పచ్చడి జీవిత సారాన్ని తెలియజేస్తుందని అన్నారు. టీజీవీ కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఇనాయతుల్లా వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

అలరించిన ఉగాది సంబరాలు...

టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి జరిగిన ఉగాది సంబరాలు తొలుత కృష్ణ బృందం నాదస్వర కచ్చేరితో వైభవంగా ఆరంభమయ్యాయి. అనంతరం ఈ ఏడాది రాశిఫలాలను తెలియజేస్తూ ప్రముఖ శాస్త్ర పండితుడు భానుశర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా కూచిపూడి నృత్య గురువు కరీముల్లా బృందం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం జిల్లాలో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి ఉగాది పురస్కారా లు అందజేశారు. జి. పుల్లయ్య (విద్య), పి. దస్తగిరి (పద్య నాటకం), గీతాంజలి (సంగీతం), జంధ్యాల రఘుబాబు (సాహిత్యం), పి. మీనా (నృత్యం), ఎం. శ్రీనివాసరాజు (జర్నలిజం), మంజుల (హరికథ), దాసరి వెంకటరమణ (చిత్రలేఖనం), ఎం. వినీల (వాస్తు)లలో ఎంపిక చేసి జ్ఞాపిక, శాలువలతో ఘనంగా సత్కరించారు. అలాగే కవి సమ్మేళనంలో పాల్గొన్న ఇనాయతుల్లా, బీవీ స్వరూప్ సిన్హా, కల్యాణదుర్గం స్వర్ణలత, డాక్టర్ కె. చంద్రమౌళిని తదితరులను సత్కరించారు.



విద్యావేత్త పుల్లయ్యను సత్కరిస్తున్న టీజీ వెంకటేశ్

యుగానికి ఆరంభం ఉగాది పర్వదినం


మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర నాయకుడు కృష్ణార్జునరెడ్డి

ఆత్మకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): యుగానికి ఆరంభం ఉగాది పర్వదినమేనని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) రాష్ట్ర కార్యదర్శి కృష్ణార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులోని జీ.పుల్లారెడ్డి స్కూల్‌లోఉగాది ఉత్సవాలను నిర్వహించారు. ముందు ఆర్ఎస్ఎస్ ఆధ్య సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ కేశవ్‌రామ్ బలిరామ్ పంత్ హెడ్గేవార్ చిత్రపటానికి ప్రణామం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రకృతిలో చోటు చేసుకునే మార్పులను ఆధారంగా చేసుకుని సనాతన సంప్రదాయాల ప్రకారం ప్రసిద్ధ ఖగోళ, జ్యోతిష్య శాస్త్రవేత్తలు క్యాలెండర్లను రూపొందించడం జరిగిందన్నారు. అయితే కాలానుగుణంగా ప్రకృతిలో మార్పులతో సంబంధం లేకుండా తయారైన క్యాలెండర్‌లో సరైన ప్రామాణికాలు లేవన్నారు. హిందువులు ఐక్యంగా మెలిగి సనాతన ధర్మ రక్షణకు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఆత్మకూరు ఖండ కార్యవాహ వాసుదేవరెడ్డి, విశ్వహిందూ పరిషత్ నాయకులు శ్రీధర్‌గుప్తా, సమరసతాసేవా ఫౌండేషన్ నాయకులు బాణాల లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం ఆలోచనే లేదు


మాట్లాడుతున్న మోమిన్ అహ్మద్‌హుసేన్

ఆత్మకూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మారూఫ్ ఆసియాను అవిశ్వాస తీర్మానంతో పదవి నుంచి దించే ఆలోచనే మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి లేదని రాష్ట్ర హజ్ కమిటీ మాజీ చైర్మన్ మోమిన్ అహ్మద్‌హుసేన్ స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే శిల్పా వైసీపీ కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియాను పదవిలో నుంచి దించాలని కుట్రలు పన్నుతున్నట్లు ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నిజానికి వైసీపీ పరిశీలకులు సతీష్‌రెడ్డి చైర్మన్, కౌన్సిలర్లతో మాట్లాడి అవిశ్వాసం అవసరం లేదని నిర్మోహమాటంగా చెప్పినట్లు గుర్తుచేశారు. చైర్మన్, కౌన్సిలర్ల మధ్య తలెత్తిన సమన్వయలోపం వల్లే ఈ సమస్య ఉత్పన్నమైందని అన్నారు. అదేవిధంగా అభివృద్ధిని అడ్డుకునేందుకే కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశానికి రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాజకీయాల్లో దూషణలతో కూడిన విమర్శలు చేయడం తగదని, దీన్ని ప్రజలు హర్షించరన్నారు. ఈ సమావేశంలో టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్ ఉన్నారు.

టీడీపీ సభ్యత్వ కార్డుల పంపిణీ


వేంపెంట గ్రామంలో టీడీపీ సభ్యత్వ కార్డులను పంపిణీ చేస్తున్న నాయకులు

పాములపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ వేల టీడీపీ నాయకులు టీడీపీ సభ్యత్వ కార్డులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఆదివారం మండలంలోని వేంపెంట గ్రామంలో టీడీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, లెనిన్‌బాబు, ఆదిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి 1300 సభ్యత్వ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌గౌడ్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు

ఏప్రిల్ చివరి వరకు నీరు ఇవ్వాలి


ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

బండిఆత్మకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కింద వరి పంటకు ఏప్రిల్ చివరి వరకు సాగునీరు ఇవ్వాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, డేవిడ్, రాజు డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాల, ఆత్మకూరు ప్రధాన రహదారిలో బండిఆత్మకూరు బస్టాండ్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరు వెన్ను విరచి గింజ పాలు తీసుకునే సమయంలో ఉందని, 3వ బ్లాక్ కింద పంట నీరు అందక భూమి పగుళ్ళు వస్తోందన్నారు. ఏప్రిల్ చివరి వరకు నీరు అందితేనే పంట పండుతుందని, లేదంటే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు.

సంబరంగా ఉగాది


మహానందిలో భక్తుల సందడి

ఆత్మకూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉగాది వేడుకలు ఘనంగా ప్రజలు నిర్వహించుకున్నారు. గ్రామాగ్రామాన తెలుగు పండగ అంబరాన్నంటాయి. ఉదయాన్నే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆత్మకూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని వీధి అరుగులు, ఆలయాల్లో పంచాంగ పఠనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో పురోహితులు గరుడాద్రి భానుమూర్తి, గరుడాద్రి సత్యనారాయణశర్మ, గరుడాద్రి వెంకటేశ్వరశర్మలు మాట్లాడుతూ పంచాంగమనగా.. పంచ అంగములని వాటిలో తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే అంగాలతో పంచాంగాన్ని రూపొందిస్తారని పేర్కొన్నారు. ఉగాది పర్వదినాన పంచాంగ శ్రవణమును వింటే మానవునికి సంపద, బుద్ధి, సత్ప్రవర్తన కల్గుతాయని అలాగే దేశంలోని మహానదుల్లో స్నానామాచారిస్తే ఎంత పుణ్యం కల్గుతుందో అంతే పుణ్యం పంచాంగ శ్రవణం వింటే కల్గుతుందని ప్రభోదించారు. పంచాంగం ప్రకారం ఈ ఏడాదిలో కొంత ఆశాజనంగానే వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, ఎరుపు రంగు, చిరుధాన్యాలు ధాన్యాలు మంచి దిగుబడి, వుండటమే కాకుండా రైతులకు గిట్టుబాటు ధర లభించనుందని చెప్పారు. నూనెలు, నెయ్యి, తేనె వంటి ధరలు తగ్గుతాయని తెలిపారు. బంగారు ధరలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఎర్రనేలల్లో మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ఆలయాలకు భక్తులు తరలివచ్చి నైవేద్యాలను సమర్పించారు. అంతేకాకుండా నూతన వస్త్రాలు, పిండివంటలతో కుటుంబసమేతంగా ఉగాది ఉత్సవాన్ని సంబరంగా జరుపుకొన్నారు.

నంద్యాల కల్చరల్: నంద్యాల పట్టణంలోని ఆదివారం ఉగాది సందర్భంగా సాయంత్రం సంజీవనగర్ కోదండరామాలయంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో యడవల్లి కార్తికేయశర్మ, బ్రహ్మణసేవాసమాఖ్య ఆధ్వర్యంలో భద్రావతి భావనాఋషి ఆలయంలో సుధీంద్రాచార్యులు, ఎస్‌బీఐ కాలనీ రామాలయంలో కమిటీ ఆధ్వర్యంలో భార్గవరామశర్మచే పంచాంగశ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజలు వారి రాశిఫలాలు తెలుసుకున్నారు.

పాములపాడు: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలలో ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. ఆదివారం నూతన తెలుగు సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ ఉగాది పండుగ సందర్భంగా పాములపాడులోని చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని పగిడ్యాల, బీరవోలు, సంకిరేణిపల్లె, ముచ్చుమర్రి, నెహ్రూనగర్, లక్ష్మాపురం, ప్రాతకోట, ఘనపురం గ్రామాల్లో శ్రీవిశ్వవసునామ ఉగాది పండుగ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని సుంకులమ్మ ఆలయాలల్లో భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నందికొట్కూరు: ఉగాది పండుగను నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం ఉదయం నందికొట్కూరు పట్టణంలోని సుంకులాపరమేశ్వరి అమ్మవారు, సవారమ్మ దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మిడుతూరు: మిడుతూరు మండంలోని వివిధ గ్రామాల్లో విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండల వేడుకలను ఘనంగా నిర్వహించారు. సాయంత్ర ఆలయాల్లో పురోహితులు పంచాగం చదివి వినిపించడం జరిగింది. మిడుతూరు లక్ష్మీచెన్న కేశవస్వామి ఆలయంలో పురోహితుడు సుబ్రహ్మణ్యం శర్మ, వెంట రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవ విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

గడివేముల: మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉగాది పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామంలోని ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. గడిగరేవుల గ్రామంలో దుర్గాభోగేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ పంచాంగం పఠనం చేశారు.

● సంప్రదాయబద్ధంగా పంచాంగ పఠనం

కొత్తపల్లి: ఈ ఏడాది ప్రభుత్వ పాలన ప్రజలకు ఆదర్శంగా ఉంటుందని ప్రముఖ పురోహితులు లక్ష్మినరసయ్య శర్మ తెలిపారు. ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో గ్రామ పెద్దలు, పురప్రముఖుల సమక్షంలో పురోహితులు పంచాంగ శ్రవణాన్ని చదివి వినిపించారు.

● రామాలయంలో అఖండ భజన:

ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం రాత్రి నుంచి కొత్తపల్లిలోని సీతారామస్వామి ఆలయంలో అఖండ భజన కార్యక్రమం ఉంటుందని పురోహితులు లక్ష్మినరసయ్య శర్మ తెలిపారు. గ్రామ పెద్దల సహకారంతో 24 గంటల పాటు శ్రీరామ.. జయరామ.. జయజయరామ నామస్మరణతో అఖండ భజన 9 రోజుల పాటు ఉంటుందన్నారు. ఏకధాటిగా నిర్వహించే ఈ అఖండ భజనలో పలు భజన సంఘాలు పాల్గొంటాయనీ తెలిపారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో ఉగాది పండుగను భక్తి శ్రద్ధలతో ఆదివారం ఘనంగా జరిపారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన ఉగాది పచ్చడిని సేవించారు. పలు ఆలయాల్లో పురోహితులు ఉగాది పంచాంగాన్ని చదివి వినిపించారు.

బండిఆత్మకూరు: మండలంలోని 24 గ్రామాల్లో ఉగాది వేడుకలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఆదివారం ఆలయాల ఈవోలు నాగప్రసాద్, వేణునాథరెడ్డి నేతృత్వంలో తెలుగు సంవత్సరాది ఆరంభం రోజున ఉగాది వేడుక పురష్కరించుకుని వుకువ జామునే ఇళ్ళ ముంగిళ్ళను రంగవళ్ళులతో, మామిడి తోరణాలు, బంతిపూల మాలలతో అందంగా అలంకరించారు. నూతన వస్త్రాలు ధరించి ఆయా గ్రామాల్లోని ఆలయాలకు వెళ్ళి స్వామి వార్లను దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం వేద పండితుల చేత పంచాంగ శ్రవణాలు చేయించి మేళతాళాల వాయిద్యాల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీల్లో స్వామి వార్లకు గ్రామోత్సవాలు నిర్వహించారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతంగా ఉంటుంది..

మహానంది, మార్చి 30 (ఆంధ్రజ్యోతి):, విశ్వావసు నామసంవత్సరంలో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతంగా ఉంటుందని మహానంది ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని తెలిపారు. ఉగాది పర్వదినం పురస్కరించుకొని ఆదివారం మహానంది క్షేత్రంలో అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేసారు. సాయంత్రం 6 గంటల నుండి ఆలయ ప్రాంగణంలోని కళావేదికలో ఆలయ వేదపండితులు మహానంది దేవస్థానం రూపొందించిన విశ్వా వసు నామ సంవత్సరం పంచాంగం పుస్తకాన్ని ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం ఈసంవత్సరంలో జరిగే మంచి చెడులను వేదపండితులు పంచాగం చదివి వినిపించారు. కార్యక్రమంలో నంద్యాల రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, ఏఈఓ యర్రమల్ల మధు, ఇంజనీరింగ్ అధికారి శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యలు పాల్గొన్నారు.

మహానందిలో పోటెత్తిన కన్నడ భక్తుల రద్దీ: ఉగాది పర్వదినం పురష్కరించుకొని వేలాదిమంది కన్నడ భక్తులు ఆదివారం మహానంది క్షేత్రానికి తరలి వచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి నిరంతరం దర్శనం అమలు పరిచారు. నంద్యాల ఏఎస్పీ మందా జావళి ఆలయ పరిసరాలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. సాంప్రదాయం ప్రకారం కర్ణాటక భక్తులు తమ ఇంటి ఆడపడుచులకు సారెతో పాటు చాటలు, పట్టుడు కర్రలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపారు. ఆదివారం అర్థరాత్రి నుంచి మహానందిలో కర్ణాటక భక్తుల రద్దీ మరింత పెరిగింది. సోమవారం సాయంత్రం వరకు క్షేత్రంలో రద్దీ కొనసాగుతుంది.


బండి ఆత్మకూరు మండలం పెద్ద దేవళాపురంలో వరదరాజస్వామి గ్రామోత్సవం


మిడుతూరులో పంచాంగ పఠనం చేస్తున్న పురోహితులు


రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతున్న యువకులు


కొత్తపల్లి తాండవ మల్లేశ్వరస్వామి ఆలయంలో పంచాంగం వివరిస్తున్న పురోహితుడు లక్ష్మీనరసయ్య శర్మ


మహానందిలో బందోబస్తున్న పరిశీలిస్తున్న అడిషనల్ ఎస్పీ మందా జావళి


మహానందిలో పంచాంగం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఈవో శ్రీనివాసరెడ్డి


వెలుగుడులో...


గడిగరేవులలో పంచాంచగం వినిపిస్తున్న అర్చకుడు శ్యామ్‌సుందర్‌శర్మ

బండలాగుడు పోటీలు ప్రారంభం

పగిడ్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ సందర్భంగా మండల పరిధిలోని లక్ష్మాపురం గ్రామంలో అంతర్‌రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ఆదివారం ఎమ్మెల్యే గిత్తా జయసూర్య ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పండుగల సందర్భంగా పోటీలను ఏర్పాటు చేయడం గొప్పవిషయం అన్నారు. ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రశాంత వాతవరణంలో నిర్వహించుకోవాలని కోరారు. వివిధ ప్రాంతాలకు చెందిన 10 జతల ఎద్దులు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ నాయకుడు మాండ్ర సురేంద్రనాద్‌రెడ్డి ఉన్నారు.

బాధితురాలికి చెక్కును అందజేసిన ఎమ్మెల్యే

మండల పరిధిలోని పడమర ప్రాతకోట గ్రామానికి చెందిన శేషమ్మ అనే బాధితురాలికి ఆదివారం ఎమ్మెల్యే గిత్తాజయసూర్య చెక్కును అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన శేషమ్మకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.37,551 చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి, నాగేషులు, వెంకటరెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

వాహనాల జాతర

ఉగాది ఉత్సవాలకు శ్రీశైలానికి కన్నడ భక్తులు పోటెత్తారు. వారం నుంచి కాలినకడన, బస్సులు, ప్రైవేటు వాహనాల్లో శ్రీశైలానికి చేరుకున్నారు. ఆదివారం రథోత్సవం సందర్భంగా అధిక సంఖ్యలో కర్ణాటక నుంచి వాహనాలు రావడంతో శ్రీశైలం సమీపంలో నిలిపారు.



నేడు రంజాన్


ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

వెలుగోడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం రంజాన్ పండుగను నిర్వహిస్తున్నట్లు ముస్లిం మతపెద్దలు తెలిపారు. ప్రత్యేక ప్రార్థన కోసం వెలుగోడు పట్టణంలోని ఈద్గాతో పాటు పలు మసీదులలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నెల రోజులు పాటు కఠోర దీక్షలు చేపట్టిన దీక్షపరులకు పలువరు ఆదివారం ఇఫ్తార్ విందులను ఇచ్చారు.

ఢిల్లీలో నంద్యాల విద్యార్థుల నృత్య ప్రదర్శన



విద్యార్థులను, గురువును అభినందిస్తున్న నిర్వాహకులు

నంద్యాల కల్చరల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉగాది సంబరాలలో నంద్యాలకు చెందిన సాయి నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రానికి చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేశారు. ఈ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వ శాఖ కార్యదర్శి కటికతల శ్రీనివాస్, రెసిడెంట్ కమిషనర్ లవ్ అగర్వాల్ ఐఏఎస్ ఏపీ భవన్ వారు నృత్యాన్ని తిలకించి విద్యార్థులను అభినందించారని నాట్యాంజలి కూచిపూడి కళాక్షేత్రం నిర్వాహకులు పల్లంశెట్టి సురేష్ తెలిపారు. అనంతరం నిర్వాహకులు గురువు సురేష్, విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్ ప్రదానం చేశారు.

ఘనంగా ఉగాది సంబరాలు

- ఆలయాలను దర్శించుకున్న భక్తులు
- పంచాంగ పఠనం చేసిన పండితులు

మూల పెద్దమ్మకు పూజలు


డబ్ల్యూ.గోవిందిన్నెలో పెద్దమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

దొర్నిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో వెలసిన మూలపెద్దమ్మ అమ్మవారిని ఆదివారం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అంతకముందు ఎమ్మెల్యే భూమి అఖిలప్రియకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. సర్పంచ్ బాల య్య ఉపసర్పంచ్ హరి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు ఏరువ ప్ర సాదరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు వెంకట్‌నాయుడు, నాయకులు భూమా సంతోష్‌రెడ్డి, భూమా సందిప్ రెడ్డి, తాళ్లూరి నాయుడు, మహే శ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అంజి ఉన్నారు.

వైభవంగా ఏరువాక పనులు ప్రారంభం


చాగలమర్రిలో ఏరువాకను ప్రారంభిస్తున్న అన్సర్‌బాషా

చాగలమర్రి, మార్చి 30 (ఆంధ్ర జ్యోతి): మండలం లోని ఆయా గ్రామా ల్లో ఉగాది పండుగ సందర్భంగా వేద పం డితుల పంచాంగ శ్రవణం ద్వారా రైతు లు ఆదివారం ఏరువాక పనులను చేపట్టారు. చాగలమర్రి గ్రామంలో ఏరువాక పనులను టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మౌలాలి, జెట్టి నాగరాజు, జల్సాగౌస్, అస్రఫ్, రైతులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ అధ్యక్షులకు సన్మానం

చాగలమర్రి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, యువజన సంఘం అధ్యక్షుడిగా వినోద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉగాది సందర్భంగా ఆదివారం ఆర్యవైశ్యులు వారిని శాలువ, పూలమాలలతో సన్మానించారు. అనంతరం కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో పంచాంగ పఠన కార్యక్రమం నిర్వహించారు. చెన్నకేశవ, రామలింగేశ్వర ఆలయాల్లో శ్రీనివాసశర్మ, అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయాల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి నవరాత్రి మహోత్సవాలు

చాగలమర్రి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కోదండరామ, పట్టాభిరామ, వీరాంజనేయస్వామి ఆలయాలతో పాటు కొలుములపేట, చిన్నవంగలి గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి వసంత నవరాత్రి మహోత్సవాలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 7వ తేదీ వరకు ఉభయదారులచే ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. 6న శ్రీరామనవమి పండుగ సందర్భంగా ఉత్సవమూర్తుల కల్యాణ మహోత్సవం, 7న పాన్పుసేవ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగుస్తాయని అన్నారు. కోదండరామాలయం, వీరాంజనేయస్వామి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్‌కు సన్మానం


ఆలంకొండ నబీసాహెబ్‌ను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

డోన్ టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మార్కెట్ యార్డు నూతన చైర్మన్‌గా నియమితులైన డోన్ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు ఆలంకొండ నబీ సాహెబ్‌ను సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, నాయకులు సన్మానించారు. అలాగే కటారుకొండ శ్రీరాములును సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సుంకయ్య, లెనిన్‌బాబు, రాధాకృష్ణ, సొంటి లక్ష్మీ నారాయణ, డోన్ బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి జే.రవి మోహన్ ఉన్నారు.

గ్రంథాలయం ప్రారంభం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్

ఉయ్యాలవాడ, మార్చి 30(ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఆర్.పాంపల్లెలో ప్రకృతి పీఠం వ్యవస్థాపకుడు, గ్రంథాలయ రిటైర్డ్ అధికారి పల్లె నరసింహరెడ్డి వారి తల్లిదండ్రుల స్మారకార్థం భారత్ అనే నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ చాబోలి లక్ష్మీదేవి గ్రంథాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో క్రిష్టారెడ్డి, నరసింహరెడ్డి, చిన్న సుబ్బారెడ్డి, బాలిరెడ్డి, మద్దిలేటి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి, సాంప్రదాయాలు, ఆచారాలకు అద్దం పట్టే తెలుగు క్యాలెండరు రూపొందించడం అభినందనీయమని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక వారు రూపొందించిన త్రైతసిద్ధాంతం తెలుగు క్యాలెండరును ఆయన ఆవిష్కరించారు. సభ్యులు మీర్జాపురం పీఎంహెచ్ నాయుడు, పోరెడ్డి రామక్రిష్టారెడ్డి, బాలు, భూపాల్, రవి పాల్గొన్నారు.

దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్

బేతంచెర్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివశక్తి బైక్ జోన్ దుకాణంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో రూ.2.50 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు బాలకృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. ఉగాది పండుగ సందర్భంగా దుకాణంలో పూజలు చేసి తాళం వేసి వెళ్లగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దుకాణంలో ఉన్న రేడియం కటింగ్ మిషన్, ల్యాప్‌టాప్, ఇన్వర్టర్, నగదు కాలిపోయినట్లు తెలిపారు.

వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు

డోన్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగను పురస్కరించుకుని పట్టణంలోని కంబలపాడు సర్కిల్ రోడ్డు ప్రాంతంలో ఉన్న వాల్మీకి విగ్రహానికి వాల్మీకులు ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు శీలం భాస్కర్ నాయుడు, కృష్ణమూర్తి, విజయమోహన్ నాయుడు, నాగేంద్ర, కేశవయ్య, రామయ్య, మధు పాల్గొన్నారు.


కొలిమిగుండ్లలో లక్ష్మీనరసింహస్వామికి పూజలు


ముత్యాలపాడులో మూర్తి లక్ష్మీనరసింహస్వామికి పూజలు చేస్తున్న టీడీపీ నాయకులు


రుద్రవరంలో సంతాన వేణుగోపాలస్వామి

చాగలమర్రి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. ముత్యాలపాడు గ్రామంలో పిల్లలు, పెద్దలు, యువకులు రంగులు చల్లుకుంటూ మూర్తి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు ఉత్సవ పల్లకికి ప్రత్యేక పూజలు చేశారు. వెల్లాల క్షేత్రంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి పల్లకి సేవ నిర్వహించారు. ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాంగ శ్రవణం వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలో పల్లెపల్లెనా శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పండుగను ఆదివారం వైభవంగా జరుపుకున్నారు. పాడెద్దులతో ఏరువాక పనులు ప్రారంభించారు. మరికొన్ని గ్రామాల్లో ట్రాక్టర్లతో పొలం దున్ని వ్యవసాయ పనులు ప్రారంభించారు. మారెమ్మ, సుంకులమ్మ, పెద్దమ్మ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయస్వామి, నర్సింహస్వామి, లింగమయ్యస్వామి, ఇంకా పలు దేవాలయాల్లో ఉగాదికి పూజలు చేశారు. వాసాపురం వేంకటేశ్వరుడి ఆలయంలో వేద పండితులు వారణాసి గోపిశర్మ శివశర్మ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం పంచాంగపఠన శ్రవణం చేశారు.

ప్యాపిలి: పట్టణంలోని హనుమాన్, సాయిబాబ, పెద్దమ్మ, అంకలమ్మ, వెంకటేశ్వరస్వామి, కన్యకాపరమేశ్వరీదేవి, భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

బనగానపల్లె: పట్టణంలోని కొండపేట సుంకులమ్మను భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సుంకులమ్మ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు చల్లటి రస్నాను పంపిణీ చేశారు. అవుకు రహదారిలోని బాట సుంకులమ్మ, తెలుగుపేటలోని బంగారమ్మ, యాగంటిపల్లె రహదారిలోని సుంకులమ్మ భక్తులు దర్శించుకున్నారు. యాగంటిపల్లెలో శ్రీ సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. మండలంలోని పలుకూరు గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం వినిపించారు.

డోన్ రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆలయాల్లో పురోహితులు పంచాంగ శ్రవణం వినిపించారు. మండలంలోని చిన్నమల్కాపురం గ్రామంలో ఓ దర్గా వద్ద పురోహితుడు బాల సుబ్బయ్య పంచాంగ పఠనాన్ని వినిపించారు. చింతలపేట గ్రామంలో పురోహితులు ప్రహ్లాద శర్మ అంజనేయ స్వామి ఆలయంలో రైతులకు, ప్రజలకు పంచాంగ శ్రవణం వివరించారు. ఉగాది పండుగ వేడుకలతో గ్రామాలు కళకళలాడాయి.

అవుకు : పట్టణంలో వెలసిన గ్రామ దేవత మూలమ్మ ఆలయంలో అర్చకులు నరసింహులు, హరిమురళి అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం మూలమ్మ, ఎస్‌కోటిఎల్లయ్య, పెద్దమ్మ, సుంకులమ్మ, మారెమ్మ, జమ్ములమ్మ ఆలయాలకు భక్తులు చేరుకొని పూజలు చేశారు. లక్ష్మీ చెన్నకేశవస్వామిని ఊరేగిం చారు. ఆలయాల వద్ద అర్చకులు పంచాంగపఠనం చేశారు.

దొర్నిపాడు : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు పంచాంగ శ్రవణం వినిపించారు. అలాగే దొర్నిపాడులో సీతారాముల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

శిరివెళ్ల: మండలంలో శ్రీవిశ్వావసు నామ తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో ప్రజలు రంగులు చల్లుకుంటూ ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. శిరివెళ్ల, యర్రగుంట్ల, కోటపాడు, గోవిందపల్లె తదితర గ్రామాల్లో కొలువైన మారెమ్మ, గ్రామ దేవతల ఆలయాలకు మహిళలు తరలివెళ్లి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బేతంచెర్ల: మండలంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో ఆదివారం జరుపుకున్నారు. పట్టణంలోని గౌరిపేటలో వెలసిన గ్రామ దేవత పరమేశ్వరిదేవికి పూజలు నిర్వహించేందుకు బారులు తీరారు. ఎద్దులను రంగులతో అలంకరించి వ్యవసాయం పనులు ప్రారంభించారు. అలాగే సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక వాహనంలో ఊరేగింపు నిర్వహించారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో వేద పండితులు శివజేత శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ఈవీ సుజాత శర్మ, శ్రీధర్ రెడ్డి, గౌరి హుశేన్ రెడ్డి, పుల్లారెడ్డి, యదునాథరెడ్డి, బుగ్గన విశ్వనాథరెడ్డి, భక్తులు పాల్గొన్నారు. అలాగే విశ్వహిందూ పరిషత్ నాయకులు ఉగాది తెలుగు సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి, నాయకులు గూని నాగరాజు, కందగడ్డల రామ్మూర్తి, గౌరి హుశేన్ రెడ్డి, గుండా గోపాల్, మారుతి శర్మ, పుల్లారెడ్డి, నాగమోహన్, విశ్వనాథరెడ్డి, ఎలైసీ శ్రీను పాల్గొన్నారు.

కోవెలకుంట్ల : పట్టణంలోని పాటిమీద ఆంజనేయస్వామి ఆలయానికి వాహనాలు, బండ్లతో ప్రజలు వచ్చి గుడి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అలాగే సౌదరిదిన్నె, అమడాల, బిజినవేముల, వెలగటూరు, చిన్నకొప్పెర్ల, పెద్దకొప్పెర్ల, వల్లంపాడు, లింగాల కలుగొట్ల, భీమునిపాడు, గుళ్లదుర్తి దితర గ్రామాల్లో ప్రజలు ఉగాది పండుగను ఘనంగా నిర్వహించారు.

కొలిమిగుండ్ల: మండలకేంద్రంలోని కుంటెమ్మ ఆలయం, కనకాద్రిపల్లె, అంకిరెడ్డిపల్లె, బెలుం తదితర గ్రామాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపో యాయి. మండలకేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఉత్సవమూర్తులను గ్రామోత్సవం నిర్వహించారు. పండితులు ఆలూరు రాఘవేంద్రప్రసాద్, నరసింహప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు.

సంజామల: మండల వ్యాప్తంగా విశ్వావసు నూతన సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సంజామలలో వనం వెంకటేశ్వరస్వామి ఆలయం, ఆల్వకొండ క్రాస్‌రోడ్డు వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. పేరుసోముల చెన్నకేశవ స్వామి ఆలయంలో అర్చకుడు శ్రీనివాసాచారి పంచాంగ శ్రవణం చేశారు.

ఆళ్లగడ్డ(శిరివెళ్ల): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ అహోబిలంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదిన వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, తిరుమంజనం నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి ఆలయ మాడ వీధుల్లో విహరిస్తుండగా భక్తులు గోవింద నామస్మరణతో పులకించిపోయారు.


అవుకు పట్టణంలో..


చింతలపేటలో పంచాంగం వినిపిస్తున్న పురోహితులు


శిరివెళ్లలో మారెమ్మకు మొక్కులు చెల్లిస్తున్న మహిళలు


బనగానపల్లె సుంకులమ్మ గుడి వద్ద భక్తులు


బేతంచెర్ల పట్టణంలోని గౌరిపేటలో...


శిరివెళ్లలో రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకుంటున్న గ్రామస్థులు

చౌడేశ్వరీమాత బ్రహ్మోత్సవాలు ప్రారంభం

బనగానపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందవరం గ్రామంలో వెలిసిన చౌడేశ్వరీదేవి ఉగాది జ్యోతి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈవో కామేశ్వరమ్మ, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం గణపతి పూజ, పుణ్యహవాచనం అనంతరం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉగాది సందర్భంగా ఆలయంలో పంచాగశ్రవణం నిర్వహించారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయం చుట్టూ పన్నేరపు బండ్లను తిప్పారు. వృషభాలకు రంగులు చల్లి అందంగా పన్నేరపుబండ్లను అలంకరించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి చౌడేశ్వ రీ దేవి మాతను దర్శించుకొని నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది, గ్రామస్థులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


చౌడేశ్వరీమాత

నేడు చెన్నకేశవ స్వామి కల్యాణం

ఉగాది బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 8 గంటల నుంచి శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి వార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఈవో కామేశ్వరమ్మ, తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 10 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


మొదటి విజేత జట్టుతో వలసల రామకృష్ణ

డోన్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పండుగ పురస్కరించుకుని మండలంలోని వలసల గ్రామంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పోటీల్లో 44 టీములు పాల్గొనగా.. గెలుపొందిన ఆరు జట్లకు నగదు బహుమతులు ప్రదానం చేశారు. మొదటి విజేతగా గెలుపొందిన గోనెగండ్ల కబడ్డీ జట్టుకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వలసల రామకృష్ణ రూ.20,016లు నగదు బహుమతిని అందజేశారు. రెండో విజేతగా నిలిచిన పంచలింగాల జట్టుకు టీడీపీ నాయకులు వలసల బాలుడు రూ.15,016లు అందజేశారు. మూడో విజేతగా నిలిచిన కొలిమిగుండ్ల జట్టుకు ట్రాక్టర్ మోహన్ రూ.10వేలు, నాలుగో స్థానంలో నిలిచిన నేలటూరు జట్టుకు లక్ష్మింపల్లె బ్రదర్స్ రూ.6వేలు, ఐదవ స్థానంలో విజేతగా నిలిచిన నూతనపల్లి జట్టుకు బుక్కాపురం సంజీవ రూ.4వేలు, 6వ స్థానంలో నిలిచిన ముద్దవరం విజేతకు ట్రాక్టర్ మద్దిలేటి రూ.3వేల బహుమతి ప్రదానం చేశారు. టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి వలసల సుధాకర్ భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కంగిరిస్వామి తిరునాళ్లు

ఉయ్యాలవాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దమల్ల గ్రామంలో వెలసిన కంబగిరి స్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్య లో తరలివచ్చారు. ఉయ్యాలవాడ, అల్లూరు, మాయలూరు. పడిగెపాడు, నర్సిపల్లె, ఇంజేడు, రూపనగుడి, మాయలూరు గ్రామాల నుంచి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు, కార్లతో వచ్చి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.


హారతి స్వీకరిస్తున్న భక్తులు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన తేరుబండ్లు:

కంబగిరి స్వామి తిరునాళ్లలో తేరుబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ఉయ్యాలవాడ గ్రామస్థులు ఆరుకాడుల ఎద్దులతో తేరుబండిని తీసుకవచ్చారు. సుద్దమల్ల గ్రామ శివారుల్లోని వరి పంట పొలాల్లో తేరును లాక్కురావటం ఆసక్తికరంగా మారింది. అలాగే అల్లూరు గ్రామస్థులు రెండు తేరుబండ్లను 12 కాడుల ఎద్దులతో కుందానదిలో నడుములోతు నీళ్లలో తేరుబండ్లను లాక్కురావటం ఆశ్చర్యానికి గురి చేసింది. తేరుబండ్లను వీక్షించటానికి ప్రజలు తరలివచ్చారు.


కుందానదిలో తేరుబండిని లాక్కొస్తున్న అల్లూరు గ్రామస్థులు


ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న వాహనాలు, తేరుబండ్లు

పోలేరమ్మ జాతర ప్రారంభం

రుద్రవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో పోలేరమ్మ జాతర ఆదివారం ప్రారంభించినట్లు గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో పాడిపంట చల్లగా ఉండాలని ప్రతి సంవత్సరం పోలేరమ్మ తిరునాల నిర్వహిస్తారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి పూజలు చేశారు. జాతర సందర్భంగా ఆయా పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి సుంకులమ్మ తిరునాళ్లు

సంజామల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కానాలలో వెలసిన సుంకుమ్మ పరమేశ్వరీమాత తిరునాళ్ల సోమవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అంబటి శ్రీకాంత్‌రెడ్డి, కూడాల చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఉగాది పండుగ పురస్కరించుకొని అమ్మవారి తిరుణాల జరుపడం ఆనవాయితీగా వస్తోంది. తిరుణాలలో భాగంగా రాష్ట్రస్థాయి ఎద్దుల రాతిదూలం పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

పేదలకు రంజాన్ కిట్లు పంపిణీ

బనగానపల్లె, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని కిట్లను జమాతే ఇస్లామిహింద్ బనగానపల్లె శాఖ అధ్యక్షుడు అలీబేగ్ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. సమాజంలోని నిరుపేదలను ఆదుకోవడంలో తమ సంస్థ ఎప్పుడూ ముందుంటుందన్నారు. సుమారు 260 మంది పేదలకు రూ. రెండులక్షల విలువైన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ పట్టణ సీఐ బదిలీ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణ సీఐ చిరంజీవి బదిలీ అయ్యారు. కడప జిల్లా ప్రొద్దుటూరు టూ టౌన్ సీఐగా పని చేస్తున్న యుగంధర్‌ను ఉన్నతాధికారులు ఆళ్లగడ్డ పట్టణ సీఐగా నియమించారు. సీఐ చిరంజీవి కర్నూలు ఫ్యాక్షన్ జోన్‌కు బదిలీ అయ్యారు. నూతన సీఐ యుగంధర్ త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు.

ఎర్రగుంట్లలో గడ్డివాములు దగ్ధం

డోన్ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రగుంట్ల గ్రామ సమీపంలో తిమ్మయ్య అనే రైతుకు చెందిన రెండు గడ్డివాములు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.70వేల దాకా నష్టం జరిగినట్లు బాధిత రైతు తిమ్మయ్య ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయా..? ఆకతాయిలు నిప్పు పెట్టారా అని తెలియాల్సి ఉంది.

చికిత్స పొందుతూ కౌలు రైతు మృతి

దొర్నిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కౌలురైతు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈఘటన రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ రంగయ్య తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన జిమ్మి తిమ్మయ్య(42) ఐదేళ్లుగా పొలం కౌలుకు తీసుకొని సీడ్ పత్తి సాగు చేసేవాడు. ప్రతి ఏడాది దిగుబడులు సరిగా రాక చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే దారి కానరాక తీవ్ర మనస్తాపానికి గురై శుక్రవారం ఇంటిలో భార్య, పిల్లలు నిద్రిస్తుండగా గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. భార్య గమనించి వెంటనే ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించింది. మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతి చెందడంతో ప్రభుత్వం ఆదుకోవాలని బంధువులు కోరారు.